క్లుప్తంగా

శైలజ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి



మాట్లాడుతున్న ఆనంద్‌రావు

కెరమెరి: వాంకిడి మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో 25 రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందిన విద్యార్థిని శైలజ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించడంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ మండల కన్వీనర్ కూటికల ఆనంద్‌రావు డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ బాలిక మృతికి కాంగ్రెస్ ప్రభుత్వమే కారణమన్నారు. పాఠశాల సిబ్బంది, గిరిజన సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే శైలజ మృతి చెందిందని ఆరోపించారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్

కౌటాల: సంతూర్ ఉమెన్స్ స్కాలర్‌షిప్‌కు కౌటాల శ్రీ చైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ సంగ కిరణ్‌కుమార్ తెలిపారు. స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినులకు సోమవారం స్థానిక కళాశాలలో ఎంపిక పత్రాలు అందించి అభినందించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తే ఉన్నత చదువులకు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. విప్రో సంతూర్ స్కాలర్‌షిప్‌కు కళాశాలకు చెందిన 18 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు తెలిపారు. గ్రామీణ విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర పెంచాలి



మాట్లాడుతున్న సిడాం ధర్మూ

కెరమెరి: పత్తి పంట కొనుగోలు ధరను పెంచాలని కొలాం సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు సిడాం ధర్మూ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.7000 – రూ.7500 వరకు కొనుగోలు చేస్తున్నారని, క్వింటాల్‌కు రూ. 10 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు భీంరావు, టీకం భీంరావు, ఆత్రం భీము తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు



పనులు చేయిస్తున్న వెంకట్‌నాయక్

కెరమెరి: మండలంలోని అనార్‌పల్లి గ్రామానికి వెళ్లే దారిలో గడిచిన కొద్ది రోజుల నుంచి పిచ్చిమొక్కలతో పాటు చెట్ల పొదలు విపరీతంగా పెరగడంతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో మండలంలోని అనార్‌పల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు బానోత్ వెంకట్‌నాయక్ సోమవారం పొదలు తొలగించారు. రోడ్డుకు మరమ్మతు చేయించారు.

ఎస్సైకి సన్మానం



ఎస్సైని సన్మానిస్తున్న మోతిపటార్ గ్రామస్తులు

లింగాపూర్: మండలంలో నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన గంగన్నను సోమవారం మోతిపటార్, లింగాపూర్, గోపాల్‌పూర్, కిమానాయక్‌తండా గ్రామస్తులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎస్సై మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం కృషి చేస్తానని, ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కోరారు.

తాగి నడిపితే జైలుకే..!

- డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుల నజర్
- నిత్యం పరీక్షలు, వాహనాల తనిఖీలు
- మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు
- మోతాదు మించితే జరిమానా, జైలుశిక్ష విధించేలా చర్యలు
- కౌటాలలో ఈ ఏడాది ఇప్పటివరకు 118 కేసులు



కౌటాలలో డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేస్తున్న ఎస్సై మధుకర్ (ఫైల్)

కౌటాల: జిల్లా వ్యాప్తంగా డ్రంకెన్ డ్రైవ్‌పై పోలీసుశాఖ కఠినంగా వ్యవహరిస్తోంది. నిత్యం వాహనాల తనిఖీతో పాటు డ్రంకెన్‌డ్రైవ్ పరీక్షలు చేపట్టి మద్యం తాగిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. గతంలో మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానాతో సరిపెట్టేవారు. కానీ ప్రస్తుతం కేసులు నమోదైతే మందుబాబులను జైలుకు తరలిస్తున్నారు. దీంతో మందుబాబులు హడలెత్తిపోతున్నారు.

మద్యం తాగి రోడ్లపైకి..

మద్యం తాగి వాహనాలు నడపడం ముప్పని తెలిసినా చాలా మంది తాగి వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. విందులు, వినోదాల్లో పాల్గొంటూ మత్తు ఎక్కిన తర్వాత కూడా వాహనాలు నడుపుతున్నారు. దీంతో పోలీసులు మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రాత్రి వేళల్లో ప్రధాన కూడళ్ల వద్ద వాహనాల తనిఖీలు చేపడుతున్నారు. పట్టుబడిన మందుబాబులపై కేసులు నమోదు చేస్తున్నారు. బ్రీత్ ఎనలైజర్‌లో మందుబాబుల బ్లడ్ ఆల్కహాల్ శాతం (బీఏసీ) అధికంగా నమోదవడం చూసి పోలీసులు ఆశ్చర్యపోతున్నారంటే అతిశయోక్తి కాదు. పోలీసుల నిబంధనల ప్రకారం.. ప్రతీ 100 మి.లీ రక్తంలో బీఏసీ శాతం 30కి మించకూడదు. కానీ బ్రీత్‌ఎనలైజర్ టెస్ట్‌లో మందుబాబులు సెంచరీ కొడుతున్నారు.



వెంటనే కేసులు నమోదు..

పోలీసు శాఖ డ్రంకెన్‌డ్రైవ్ చేస్తున్నప్పుడు పట్టుబడిన వారిపై వెంటనే కేసులు నమోదు చేస్తున్నారు. ఎలాంటి పైరవీలకు తావు లేకుండా బ్రీతింగ్ ఎనలైజర్ పరీక్షలు చేసి మద్యం తాగినట్లు తేలగానే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. మండలంలో ఈ ఏడాది ఇప్పటి వరకు 118 మంది మందుబాబులపై డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేశారు. మోతాదుకు మించి వాహనాలు నడిపి పట్టుబడుతున్నవారికి జైలుశిక్షతో పాటు జరిమానా విధిస్తున్నారు. వాహన ధ్రువపత్రాలు లేకుండా, మద్యం తాగి వాహనం నడిపిన సందర్భాల్లో శిక్ష ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. అలాగే పోలీసుల వాహనాల తనిఖీల్లో సరైన ధ్రువపత్రాలు లేని 3954 మందికి రూ.6,82,500 జరిమానాలు విధించారు.

అవగాహన తప్పనిసరి

జిల్లా వ్యాప్తంగా చాలా మంది డ్రంకెన్‌డ్రైవ్ చేస్తూ రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతుండటంతో వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయి. వారు నడిపే వాహనాలకు ఇన్సూరెన్స్ లేకపోవడంతో పాటు వారికి డ్రైవింగ్ లైసెన్స్ లేకపోవడం, మద్యం తాగి వాహనం నడిపినట్లు నిర్ధారణ కావడంతో ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలకు పరిహారం కూడా అందడం లేదు. మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాల్లో మరణించే వారిలో ఎక్కువ సంఖ్యలో యువకులే ఉండడం గమనార్హం. ప్రతి ఒక్కరూ డ్రంకెన్ డ్రైవ్‌తో పాటు రోడ్డు నియమ నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పోలీసులు సూచిస్తున్నారు.

కేసులు నమోదు..



మద్యం మత్తులో వాహనాలు నడిపితే జీవితాలు ప్రమాదంలో పడడమే కాకుండా ఇతరుల ప్రాణాల కు కూడా హాని కలుగుతుంది. ప్రమాదాల నియంత్రణలో భాగంగా డ్రంకెన్‌డ్రైవ్ కేసులు నమోదు చేస్తున్నాం. పట్టుబడిన వారి కి కేసు తీవ్రతను బట్టి శిక్షలు విధిస్తున్నారు. యువత కేసుల్లో ఇరుక్కోవద్దు. తద్వారా భవిష్యత్ నష్టపోయే ప్రమాదముంది. ఎంతటి వారైనా మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవు. మద్యం తాగి ఎవరూ వాహనాలు నడపొద్దు.

– ఎస్.మధుకర్, ఎస్సై, కౌటాల

సమస్యల పరిష్కారానికి కృషి



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ విఠల్

సిర్పూర్(టి): గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. మండల కేంద్రంతోపాటు నవేగాం గ్రామంలో సోమవారం పర్యటించారు. నవేగాంలోని సాయిబాబా ఆలయం వద్ద భక్తులకు తాగునీటి సౌకర్యార్థం చేతిపంపు ఏర్పాటు, బస్టాండ్ ప్రాంతంలోని వారసంత స్థలంలో రూ.లక్ష నిధులతో మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అవసరమైతే మరిన్ని నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. సిడాం గణపతి, సోహెల్ అహ్మద్, అర్షద్ హుస్సేన్, సత్యనారాయణ, కిశోర్, నానయ్య, విశ్వనాథ్, అఖిల్ అహ్మద్ పాల్గొన్నారు.

రిమ్స్‌లో ఫ్లెక్సీ గొడవ



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: రిమ్స్‌లోని ఎమర్జెన్సీ వార్డు ముందు గల షెడ్‌లో ఏర్పాటు చేసిన నారాయణ బాబా ఫ్లెక్సీని ఓ ఫౌండేషన్ సభ్యులు చించివేయడంతో గందరగోళం నెలకొంది. విషయం తెలుసుకున్న నారాయణ బాబా భక్త మండలి సభ్యులు సోమవారం ఉదయం అక్కడికి చేరుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏఎస్సై ఇంట్లో చోరీ



దొంగలు పగలగొట్టిన బీరువా

సిర్పూర్(టి): కౌటాల పోలీసుస్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న మండల కేంద్రంలోని రైల్వే కాలనీకి చెందిన అంగిరి సాయిబాబా ఇంట్లో ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడినట్లు ఎస్సై కమలాకర్ తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో కి చొరబడి బీరువాను పగలగొట్టి రెండు తులాల 5 గ్రాముల బంగారం ఆభరణాలు, 25 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు తెలిపారు. బాధితుడు సాయిబాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కౌటాలలో చోరీ

కౌటాల: మండల కేంద్రంలోని ఎడ్లబజార్ ఏరియాకు చెందిన పేట్కర్ సురేశ్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. బాధితుడు తెలిపిన వి వరాల ప్రకారం.. సురేశ్ తన భార్యకు ఆరో గ్యం బాగా లేకపోవడంతో మూడు రోజల క్రితం హైదరాబాద్‌లోని ఆసుపత్రికి వెళ్లాడు. తిరిగి సోమవారం ఉదయం ఇంటికి రాగా ఇంటి తలుపులు తెరిచి ఉండడం గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా బీరువా పగలగొట్టినట్లు గుర్తించాడు. బీరువాలో ఉన్న రూ. 65 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు తెలిపారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఉట్నూర్‌రూరల్: అభివృద్ధి నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం ఉట్నూర్ మండలంలోని సుద్దగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో నాణ్యత ప్రమాణాలు లోపించకుండా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు.

'తుకారాం వర్ధంతి సభను జయప్రదం చేయండి'

ఈనెల 29న ఉట్నూర్ మండలంలోని లక్సెట్టిపేట గ్రామంలో తొలి ఆదివాసీ ఐఏఎస్ మడావి తుకారాం 26వ వర్ధంతి సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. సోమవారం వర్ధంతి సభ పోస్టర్లను ఆవిష్కరించారు.

మాలల సింహగర్జనకు రావాలని ఆహ్వానం..

డిసెంబర్ 1న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో మాల ల ఆధ్వర్యంలో తలపెట్టిన మాలల సింహగర్జన భారీ బహిరంగ సభకు రావాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుకు ఖానాపూర్ మాల సంఘ నాయకులు ఆహ్వాన పత్రం అందజేశారు.

మాలల సింహగర్జన విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కౌటాల: మాలల సింహగర్జనను మాలలు, మహర్ కులస్తులు విజయవంతం చేయాలని మహర్ సంఘం మండలాధ్యక్షుడు బండురావు అన్నారు. సోమవారం స్థానిక బుద్ధవిహార్‌లో మాలల సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 1న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో 'హలో మాలా చలో హైదరాబాద్' కార్యక్రమంలో భాగంగా మాలల సింహగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. మాలల, మహర్ కులస్తుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని డి మాండ్ చేశారు. సుభాష్, విశ్వనాథ్, దిలీప్, దేవాజీ, ఏమాజీ, మారుతి, గోవింద్‌రావు పాల్గొన్నారు.

'మహిళల భద్రత అందరి బాధ్యత'

ఆదిలాబాద్‌టౌన్: మహిళల భద్రత అందరి బాధ్యత అని సఖీ కేంద్రం సైకో సోషల్ కౌన్సిలర్ లావణ్య అన్నారు. స్త్రీలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా అంతర్జాతీయ దినోత్సవంలో భాగంగా ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు మానవ హక్కుల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని విద్యానగర్ శ్రీ శిరిడిసాయి సేవా సొసైటీ సౌజన్యంతో కొనసాగుతున్న వృత్తి విద్య నైపుణ్య శిక్షణ కేంద్రం, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సఖీ కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కేసువర్కర్ ప్రవీణ, మల్టీపర్పస్ సునీత, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సంగీత, టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ ట్రైనర్ అన్వరి, లెక్చరర్లు, మహిళలు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా షీటీం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

ఆసిఫాబాద్‌రూరల్: మహిళలకు అండగా ఉంటూ మహిళల రక్షణ కోసం షీటీం పని చేస్తుందని షీటీం సభ్యురాలు సునీత తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షీటీంపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు సక్రమంగా క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు సాధించాలని, చెడు అలవాట్లు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ రాందాస్, షీ టీం సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్షణ పక్షోత్సవాలు ఘనంగా నిర్వహించాలి

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గనులు, అన్ని డిపార్టుమెంట్లలో 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ సూచించారు. సోమవారం గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏరియాలోని అన్ని విభాగాల అధిపతులతో రక్షణ పక్షోత్సవాల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 9 నుంచి 21 వరకు ఏరియాలో రక్షణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రక్షణ చర్యలపై అధికారులకు పలు సూచనలు అందించారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, డీజీఎం వర్క్‌షాప్ కృష్ణమూర్తి, ఎస్ఈ మదీనా బాషా తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏరియా జీఎం శ్రీనివాస్

పాన్‌కార్డుతో ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

సింగరేణి ఉద్యోగులు ఆదాయపు పన్ను శాఖ నిబంధన మేరకు పాన్‌కార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బెల్లంపల్లి ఏరియాలో ఇప్పటి వరకు సుమారు 15 మంది ఉద్యోగులు తమ పాన్‌కార్డును అధార్‌తో అనుసంధానం చేసుకోలేదన్నారు.

ఖైరిగూడ ఓసీపీని సందర్శించిన సేఫ్టీ జీఎం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీని సోమవారం బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం కే. రఘుకుమార్ సందర్శించారు. ఏరియా జనరల్ మేనేజర్ కే. శ్రీనివాస్‌తో కలిసి ఓసీపీని సందర్శించిన ఆయన క్వారీలోకి చేరుకుని రక్షణ ఏర్పాట్లను తనిఖీ చేశారు. 55వ వార్షిక రక్షణ పక్షోత్సవాల నిర్వహణ కోసం ఏర్పాట్లు ముమ్మరం చేయాలని ఏరియా అధికారులకు సూచించారు. గని ప్రమాదాల నివారణకు ప్రతిఒక్క ఉద్యోగి రక్షణ సూత్రాలు తప్పకుండా పాటించాలన్నారు. రక్షణ సూత్రాలపై ప్రతి ఉద్యోగికి అర్థమయ్యే రీతిలో కళాకారుల పాటలు, నాటిక ద్వారా రక్షణ ప్రాముఖ్యతను ఉద్యోగులకు వివరించి ప్రచారం చేయాలని సూచించారు. ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, మేనేజర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



రక్షణపై చర్చిస్తున్న రఘుకుమార్

భక్తిశ్రద్ధలతో లక్ష వత్తుల కార్యక్రమం

కౌటాల: కౌటాల వాసవీమాత ఆలయంలో కార్తిక మాసం పురస్కరించుకుని సోమవారం భక్తులు లక్ష వత్తుల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక శ్రీ కోదండ రామాలయం నుంచి వాసవీమాత ఆలయం వరకు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ మహా విష్ణుమూర్తికి పది జంటలు లక్ష వత్తుల చొప్పున మొత్తం పది లక్ష వత్తులను వెలిగించారు. అనంతరం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దీంతో ఆలయంలో భక్తుల సందడి నెలకొంది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



వాసవీమాత ఆలయంలో లక్ష వత్తుల కార్యక్రమం

రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా శిరీష



శిరీషను సన్మానిస్తున్న సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): తెలంగాణ రాష్ట్ర సెపక్‌తక్రా సంఘం సంయుక్త కార్యదర్శిగా కాగజ్‌నగర్ మండలం గన్నవరం బీసీ వెల్ఫేర్ పాఠశాల పీడీగా విధులు నిర్వర్తిస్తున్న పర్లపెల్లి శిరీషను ఎన్నుకున్నట్లుగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్‌రెడ్డి తెలిపా రు. హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో శిరీషను రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి అంతర్జాతీయ పోటీలో పాల్గొన్న ఏకైక క్రీడాకారిణిగా శిరీష ప్రసంశలు అందుకున్నారని ఆయన తెలిపారు. జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించినట్లు పేర్కొన్నారు. సెపక్‌తక్రా క్రీడలో ఎంతో నైపుణ్యం కలిగిన శిరీషకు రాష్ట్ర కార్యవర్గంలో చోటు లభించడం అభినందనీయమన్నారు. గ్రామీణ స్థాయి నుంచి సెపక్ తక్రాను ప్రోత్సహిస్తామని శిరీష తెలిపారు.

'ఏజెన్సీ చట్టాల అమలు బాధ్యత అధికారులదే'

ఇచ్చోడ: ఏజెన్సీ ప్రాంత చట్టాలను అమలు చేసే బాధ్యత జిల్లా అధికారులపై ఉందని తుడుందెబ్బ నాయకులు కొడప నగేశ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఇచ్చోడలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఇచ్చోడ సమస్యలను పరిష్కరించేందుకు ఆదివాసీ సంఘాలు ఈ నెల 30 వరకు ఇచ్చిన గడువును తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఇచ్చోడలో 1969 నుంచి స్థిరనివాసం ఉంటున్న గిరిజనేతరులకు తాము వ్యతిరేకం కాదన్నారు.



ఇచ్చోడలో మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు